సాక్షి
నిజామాబాద్
ఆదివారం । 11 । మే । 2025



నా కొడుకుకు ధైర్యం ఎక్కువ..



పాకిస్తాన్‌తో యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి నాకు భయంగా ఉంటుంది. నాకు ఒకే ఒక్క కుమారుడు మావూరి రాజేశ్. ఇష్టంతో సైన్యంలో చేరాడు. రాజేశ్ తండ్రి చిన్నతనంలో చనిపోయాడు. సర్వస్వం నేనై పెంచాను. ఒకవైపు నా కొడుకు ఆర్మీ అని గర్వంగా ఉన్నప్పటికీ జరుగుతున్న యుద్ధంలో నా కొడుకు ఏమవుతాడోనని ఆందోళనగా ఉంటుంది. దేశ రక్షణకై విధుల్లో పాల్గొన్న నా కుమారుడు ధైర్యంగానే ఉంటాడు.- మా ఊరి రాణి
(ఆర్మీ మ్యాన్ మావూరి రాజేశ్ తల్లి) అడవి మామిడిపల్లి, మాక్లూర్

గరిష్టం/కనిష్టం
41.6 /22.6

వాతావరణం
ఉదయం ఈదురుగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా టీజీఆర్‌జేసీ

నిజామాబాద్‌అర్బన్: తెలంగాణ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో ప్రవేశానికి శనివారం జిల్లా కేంద్రంలో టీజీఆర్‌జేసీ పరీక్ష నిర్వహించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష కొనసాగింది. జిల్లా వ్యాప్తంగా 31 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 7,483 మంది విద్యార్థులకు 6,564 మంది హాజరు కాగా, 919 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

చురుగ్గా సాగుతున్న చెక్‌డ్యాం పనులు



సిరికొండ: మండలంలోని గడ్కోల్ శివారులో కప్పలవాగుపై నిర్మిస్తున్న చెక్ డ్యాం పనులు చురుగ్గా సాగుతున్నాయి. చెక్‌డ్యాం నిర్మాణ పనులకు నీటి పారుదల శాఖ ద్వారా రూ.2.46 కోట్ల నిధులు మంజూరయ్యాయి. పనులకు గత నెల 4న ఎమ్మెల్యే భూపతిరెడ్డి శంకుస్థాపన చేశారు. పనులను ప్రారంభించిన కాంట్రాక్టర్ పనులను ముమ్మరంగా చేపడుతున్నారు. వాగు అడుగు భాగం నుంచి ర్యాఫ్ట్ పనులు భూమిపై భాగం వరకు చేపట్టారు. మరో 30 మీటర్ల మేర పనులు చేపట్టాల్సి ఉంది. కప్పలవాగుపై చెక్‌డ్యాం నిర్మాణం పూర్తయితే భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంటుందని గ్రామస్తులు తెలిపారు.

దంచికొట్టిన వాన

- తడిసి ముద్దయిన ధాన్యం



బాల్కొండ: బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలో శనివారం రాత్రి అకాలవర్షం దంచి కొట్టింది. దీంతో కల్లాల్లో ఉన్న సజ్జలు, నువ్వులు, కొనుగోలు కేంద్రాల్లోని వరి ధాన్యం తడిసి ముద్దయింది. సుమారు 40 నిమిషాలపాటు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉరుములు, మెరుపులతో వాన కురవడంతో ప్రజలు భయాందోళన చెందారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



మాచారెడ్డి : చుక్కాపూర్‌లోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం ఉదయం సేవాకాలం శాంతిపాఠం నిర్వహించారు. అనంతరం ద్వారతోరణ పూజలు, మూలమంత్ర హవనం, ఉత్సవ మూర్తులకు పంచామృతాలు, పండ్ల రసాలతో అభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కమలాకర్ రెడ్డి, ఈవో శ్రీధర్‌రావ్, డైరెక్టర్లు లక్ష్మీరాజం, రాజిరెడ్డి, ఆంజనేయులు, బాల్‌రెడ్డి, ఆలయ సిబ్బంది సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం

జక్రాన్‌పల్లి: తెలంగాణ ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్ఆర్ఐ పాలసీ సలహా మండలి సభ్యుడిగా కలిగోట్ గ్రామానికి చెందిన సత్యంగౌడ్(దుబాయ్)నియమితులయ్యారు. ఈసందర్భంగా దుబాయ్‌లో ఉంటున్న ఎన్నారైలు శనివారం సత్యంగౌడ్‌ను కలిసి, సత్కరించారు. విజయ్‌రెడ్డి, నర్సయ్య, మద్దుల శ్రీనివాస్, రమేష్, కాశాగౌడ్, మచ్చేందర్, మోహన్, కొట్టాల శ్రీనివాస్, చిన్ని, తదితరులు పాల్గొన్నారు.



యుద్ధంలో కొడుకు.. గర్విస్తున్న తల్లి

ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో భారత్, పాకిస్తాన్ మధ్య జరుగుతున్న యుద్ధంలో జిల్లాలోని అడవిమామిడిపల్లి గ్రామానికి చెందిన ఎనిమిది మంది సైనికులు పాల్గొంటున్నారు. అయితే తమ కుమారులు యుద్ధంలో పాల్గొనడం తమకు గర్వకారణంగా ఉందని సైనికుల తల్లులు స్పష్టం చేస్తున్నారు. ధర్మబద్ధంగా సాగుతున్న యుద్ధంలో తమ కొడుకులు విజేయులవుతారని అంటున్నారు. అడవిమామిడిపల్లి నుంచి గత 24 ఏళ్ల కాలంలో 22 మంది యువకులు ఆర్మీ, ఐటీబీపీ (ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్) దళాల్లోకి వెళ్లారు. ఈ గ్రామాన్ని 'జైహింద్ మామిడిపల్లి' అని కూడా పిలుచుకుంటున్నారు. ఆదివారం అంతర్జాతీయ మాతృ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం



దేశ సరిహద్దుల్లో అడవిమామిడిపల్లి యువకులు

- ప్రస్తుతం యుద్ధక్షేత్రంలో గ్రామానికి చెందిన ఎనిమిది మంది జవాన్లు
- గత 24 ఏళ్లలో 22 మంది ఆర్మీలోకి..
- ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో సైనికుల తల్లుల మనోభావాలు
- నేడు వరల్డ్ మదర్స్ డే



సండే స్పెషల్

నా ఇద్దరు కొడుకులు యుద్ధంలో ఉన్నారు



నా ఇద్దరు కొడుకులు శ్రీకాంత్, నవీన్ ఇష్టంతో మిలట్రీలో చేరారు. వారు పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో పాల్గొంటున్నారు. నా కొడుకుల గురించి అందరూ చెప్పుకోవటం గర్వంగా ఉంటుంది. ధర్మబద్ధంగా జరుగుతున్న యుద్ధంలో అంతా మంచి జరుగుతుంది.

– పాల్దా సాయమ్మ
(ఆర్మీ మ్యాన్‌లు శ్రీకాంత్, నవీన్ తల్లి)

సమయం దొరికితే ఫోన్‌లో మాట్లాడుతున్నాడు



పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో నా కుమారుడు సాయికుమార్ పాల్గొనటం గర్వంగా అనిపిస్తుంది. ఇంకో వైపు ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయంగా ఉంటుంది. రోజూ యుద్ధంలో ఏం జరుగుతుందనేది టీవీ చూస్తునే ఉంటాను. నా కుమారుడు సమయం దొరికినప్పుడు ఫోన్‌లో మాట్లాడుతాడు. అక్కడ అంతా బాగానే ఉందని చెప్పుతాడు. ఏది ఏమైన యుద్ధంలో పాల్గొనటం నా కుమారుడు సాయికుమార్‌కు లభించిన అదృష్టంగా అనుకుంటాను.

– జయ
(ఆర్మీ మ్యాన్ సాయికుమార్ తల్లి)

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో జిల్లాలోని అడవిమామిడిపల్లి గ్రామం గురించి జిల్లా వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. వ్యవసాయం ప్రధానంగా ఉన్న ఈ గ్రామం నుంచి ప్రస్తుతం దేశ సరిహద్దుల్లో 8 మంది జవాన్లు విధులు నిర్వహిస్తున్నారు. ఈ వ్యవసాయ కుటుంబాల నుంచే దేశసేవ కోసం యువకులు వెళుతుండడం విశేషంగా చెప్పుకోవాలి. ప్రాణాలు పణంగా పెట్టి సరిహద్దుల్లో పనిచేస్తున్న ఈ యువకులను చూసి తాము గర్వపడుతున్నామని ఈ జవాన్ల కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులందరూ ముక్తకంఠంతో చెబుతున్నారు. దేశరక్షణలో తమ గ్రామం నుంచి సైనికులు ఉండడం గర్వకారణమంటున్నారు. తమ గ్రామానికే కాకుండా జిల్లాకు సైతం యువకులు పేరు తెస్తున్నారంటున్నారు. అడవిమామిడిపల్లి గ్రామం నుంచి గత 24 ఏళ్ల కాలంలో 22 మంది యువకులు ఆర్మీ, ఐటీబీపీ (ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్) దళాల్లోకి వెళ్లారు. మొత్తం ఉత్తర తెలంగాణలోనే ఈ ఊరి ప్రత్యేకతను చాటుతున్నారు. దీంతో ఈ గ్రామాన్ని 'జైహింద్ మామిడిపల్లి' అని కూడా పిలుచుకుంటున్నారు. ఈ ఊరిలోకి అడుగుపెట్టగానే స్వామి వివేకానంద విగ్రహం కనిపిస్తుంది. అనంతరం ఊరి మధ్యలో ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహం, తరువాత మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహాలు దర్శనమిస్తాయి. దేశభక్తి స్ఫూర్తిగా విగ్రహాలు ఏర్పాటు చేసుకున్నారు. ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో తమ గ్రామ యువకుల ప్రాణాలను పణంగా పెట్టి దేశరక్షణ విధులకు పంపించడం పట్ల వారి తల్లిదండ్రులకు పాదాభివందనాలని గ్రామస్తులు చెబుతున్నా రు. జై జవాన్.. జై కిసాన్ స్ఫూర్తిని చాటుతున్న ఈ గ్రామం జిల్లాలోనే ప్రత్యేకత చాటుకుంటోంది. అవసరమైతే తాము సైతం యుద్ధరంగంలోకి దిగుతామని ఈ గ్రామానికి చెందిన రిటైర్ అయిన సైనికులు చెబుతున్నారు. రిటైరయ్యాక తాము వ్యవసాయం చేస్తున్నామని, ప్రభుత్వం పిలిస్తే తక్షణమే సరిహద్దులకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నట్లు మాజీ సైనికులు చెబుతుండడం మరింత స్ఫూర్తిని రగిలిస్తోంది.

కుమారుడిని యుద్ధానికి పంపుతా



నా కుమారుడు బానుక చంద్రశేఖర్ ఆర్మీ నుండి రిటైర్డు అయ్యారు. ప్రస్తుతం కల్లెడి పంచాతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. యుద్ధానికి పిలుపు వస్తే సంతోషంగా పంపించటానికి మా కుటుంబం అంతా సిద్ధంగా ఉన్నాము. నా కుమారుడు చంద్రశేఖర్‌కు పాకిస్తాన్‌తో జరిగే యుద్ధంలో పాల్గొనే అవకాశం వస్తే అదృష్టంగా భావిస్తాము. – బానుక లక్ష్మి
(రిటైర్డ్ ఆర్మీ మ్యాన్ చంద్రశేఖర్ తల్లి)

విధుల్లోకి రమ్మంటే ఇష్టంగా వెళ్తాను



పాకిస్తాన్‌తో మనకు జరుగుతున్న యుద్ధంలో పాల్గొనడానికి రమ్మని పిలుపు వస్తే ఇష్టంగా వెళ్తాను. యుద్ధంలో పాల్గొనటం అంటే అదో ప్రత్యేక అనుభూతిగా భావిస్తాను. ఆర్మీ ప్రధాన కార్యాలయం నుంచి పిలుపు వస్తే వెంటనే విధుల్లో చేరటానికి సిద్ధంగా ఉన్నాను. – చంద్రశేఖర్
(రిటైర్డ్ ఆర్మీ మ్యాన్)

అదృష్టంగా భావిస్తా



నా కుమారుడు గంగోనే బాలాజీ సైన్యంలో చేరి ఆరు సంవత్సరాలు అవుతోంది. దేశభక్తి నిండుగా ఉన్న నా కుమారుడు పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో పాల్గొనటం అదృష్టంగా భావిస్తాను. అందుకు నాకు గర్వంగా ఉంది. నా కొడుకు మిలట్రీ ఇచ్చిన శిక్షణలో ఆరితేరి ఉన్నాడు. శత్రువును దెబ్బతీయటంలో ముందుంటాడు. ధర్మబద్ధంగా జరుగుతున్న యుద్ధంలో నా కొడుకు విజేయుడు అవుతాడు. – గంగోనే కిషన్
(ఆర్మీ మ్యాన్ బాలాజీ తండ్రి)

మా ఊరికే గర్వకారణం



మా గ్రామం నుంచి 14 మంది సైన్యంలో చేరారు. అందులో ఆరుగురు రిటైర్డ్ అయ్యారు. ఎనిమిది మంది ప్రస్తుతం పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో పాలుపంచుకుంటున్నారు. వారు యుద్ధంలో పాల్గొనటం మా గ్రామానికే గర్వగా ఉంది.

– గంగోనే సంతోష్
(మాజీ సర్పంచ్, అడవి మామిడిపల్లి)

కలిసొచ్చిన సీడ్ సాగు



తరలించేందుకు మోర్తాడ్‌లో సిద్ధంగా ఉన్న విత్తన ధాన్యం బస్తాలు

- మద్దతు ధరతో పోలిస్తే ఎక్కువే చెల్లించిన కంపెనీలు
- వర్షాకాలం సీజన్ కోసం సాగు చేయించిన ప్రైవేట్ కంపెనీలు
- సన్నాలకు బోనస్ ప్రకటించిన ప్రభుత్వం
- ధర పెంచిన కంపెనీలు

మోర్తాడ్(బాల్కొండ): విత్తనోత్పత్తి కోసం వరి సీడ్ సాగు చేయించిన విత్తన కంపెనీలు రైతులకు ఎక్కువ ధర చెల్లించి వారిని ప్రోత్సహించాయి. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కన్నా ఎక్కువ ధరను కల్పించి రైతులకు మేలు చేశాయి. యాసంగి సీజన్‌లో సాగు చేసిన సన్నాలకు క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే.

ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,400 ధర ప్రకటించిన కంపెనీలు ప్రభుత్వం బోనస్‌ను ప్రకటించడంతో అదనంగా రూ.500 చెల్లిస్తున్నాయి. అంటే సీడ్ విత్తనం సాగు చేసిన రైతులకు ఒక్కో క్వింటాల్‌కు రూ.2,900 ధర లభిస్తోంది. సీడ్ కంపెనీలు గ్రామాల్లో తమ ఏజెంట్లను నియమించుకుని వారి మధ్యవర్తిత్వంతో రైతులతో బైబ్యాక్ ఒప్పందాలను చేసుకున్నాయి. వర్షాకాలంలో సన్న రకాలు సాగు చేసేందుకు అవకాశం ఉండటంతో సీడ్ రకం సాగులోనూ సన్నాలకే ప్రాధాన్యత ఇచ్చారు. బాల్కొండ, ఆర్మూర్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల పరిధిలోని వివిధ మండలాల్లో దాదాపు 4వేల ఎకరాల్లో విత్తన కంపెనీల కోసం వరి ధాన్యాన్ని రైతులు సాగు చేశారని అంచనా. పది కంపెనీల వరకూ తమ విత్తనోత్పత్తి కార్యక్రమం కోసం సీడ్‌ను సాగు చేయించాయి. ఒక్కో ఎకరానికి 25 క్వింటాళ్ల నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి లభించింది. ఇదిలా ఉండగా సీడ్ రకం సాగులో కంపెనీలు సూచించిన ప్రకారం రైతులు మెళకువలు పాటించారు. ఫలితంగానే దిగుబడి పెరిగిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ధర ఎక్కువ వస్తుందనే సీడ్ రకం సాగు చేశాం

ధర ఎక్కువగా వస్తుందనే సీడ్ రకం వరిని సాగు చేశాం. సీడ్ రకం వరి సాగులో చాలా జాగ్రత్తలు తీసుకున్నాం. ధర ఎక్కువ చెల్లించడంతో రైతులకు మేలు జరిగింది. సీడ్ కంపెనీలు మరింత ధర పెంచితే సాగు విస్తీర్ణం ఇంకా పెరిగే అవకాశముంటుంది.

– మాదాం నర్సయ్య, రైతు, తొర్తి

13న పాలిసెట్

నిజామాబాద్‌అర్బన్: ఈనెల 13వ తేదీన పాలిసెట్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శనివారం తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష కొనసాగనుంది. జిల్లా కేంద్రంలో మొత్తం 16 సెంటర్లు ఏర్పాటు చేయగా, 6,542 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు.

పత్రికా స్వేచ్ఛపై దాడి సిగ్గుచేటు

- ఏపీలోని కూటమి ప్రభుత్వానివి కక్ష సాధింపు చర్యలు
- సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డి ఇంటిపై పోలీసుల దాడిని ఖండిస్తున్నాం
- నిరసన కార్యక్రమాల్లో జర్నలిస్టులు



బోధన్‌లో అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

ఆర్మూర్‌టౌన్/బోధన్: నిజాలను నిర్భయంగా రాస్తున్న 'సాక్షి' దినపత్రికను అణగదొక్కేందుకు ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందని, ఎడిటర్ ధనంజయరెడ్డి ఇంటిపై పోలీసుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని జర్నలిస్టులు అన్నారు. ధనంజయరెడ్డి ఇంట్లో పోలీసుల సోదాలను నిరసిస్తూ శనివారం ఆర్మూర్, బోధన్ పట్టణాల్లో జర్నలిస్టులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపి అంబేడ్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు సమర్పించారు. ఆర్మూర్‌లో జర్నలిస్టు యూనియన్ ఫర్ స్టేట్ ఆఫ్ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు నరసింహచారి, సాక్షి దినపత్రిక బ్యూరో ఇన్‌చార్జి భద్రారెడ్డి, బోధన్‌లో ప్రింట్ మీడియా జర్నలిస్ట్ సంఘాల నాయకులు తేళ్ల రవికుమార్, లింటూరి లక్ష్మణ్ మాట్లాడారు. సాక్షి ఎడిటర్ ధనంజయ్‌రెడ్డి ఇంటిపై ఏపీ రాష్ట్ర పోలీసుల దాడి, సోదాలను ఏపీ కూటమి ప్రభుత్వ కక్ష సాధింపు చర్యగానే పరిగణిస్తామని అన్నారు. పత్రికా స్వేచ్ఛను కాపాడుకుందామని, ధనంజయరెడ్డిపై నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని అన్నా రు. ఏ ప్రభుత్వానికైనా అధికారం శాశ్వతం కాదనే విషయాన్ని పోలీసులు గుర్తించాలని, ఏపీ కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలను మానుకోవాలని హితవు పలికారు. లేని పక్షంలో భవిష్యత్‌లో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.



ఆర్మూర్‌లో అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

ఆర్మూర్‌లో జర్నలిస్టులు సురేశ్, వెంకట్, క్రాంతి, రాజేశ్, శేఖర్, భూమేశ్, సాగర్, పోశెట్టి, బోధన్‌లో బండారి సాయిలు, ఉమాకాంత్, ఖుర్షిద్, నల్వాల విజయ్, సూర్య ప్రకాశ్, రాము, తారాచంద్, కారం స్వామి, రమేశ్, జగన్, కడికే శివ, రాజేశ్, అశోక్, రాజేశ్వర్, అంజి, నవీన్, దిలీప్, నాగభూషణం, అఫ్రోజ్, సాక్షి బోధన్ ఆర్‌సీ ఇన్‌చార్జి గడ్డం గంగులు, సాక్షి టీవీ రిపోర్టర్ తోకల రవి, గణేశ్, నల్వాల క్రిష్ణ, శ్రీనివాస్, అనిల్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఎకో టూరిజంతో ముంపు గ్రామాల అభివృద్ధి



చిన్నయానం గ్రామస్తులతో మాట్లాడుతున్న మాజీ ప్రజాప్రతినిధులు, ఫారెస్ట్ అధికారులు

డొంకేశ్వర్(ఆర్మూర్): ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌లో ఎకో టూరిజం ఏర్పాటైతే ముంపు గ్రామాలు అభివృద్ధి చెందుతాయని అటవీ శాఖ అధికారులు, స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు అన్నారు. వాచ్ టవర్లు, రిసార్ట్‌ల కోసం స్థల సేకరణ నేపథ్యంలో శనివారం డొంకేశ్వర్ మండలంలోని చిన్నయానం గ్రామస్తులతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. చిన్నయానం, జీజీ నడ్కుడ, గాదేపల్లి గ్రామస్తులు సహకరిస్తే ఎకో టూరిజం ఏర్పాటు త్వరగా జరుగుతుందన్నారు. వాచ్ టవర్ల కోసం ఎకరం వరకు స్థలాన్ని ఇవ్వాలని కోరారు. టూరిజంతో స్థానికంగా ఉపాధి లభిస్తుందని, ఉద్యోగ అవకాశాల్లో గ్రామస్తులకే మొదటి ప్రాధాన్యత ఇస్తామన్నారు. భూముల ధరలు కూడా పెరుగుతాయని, అన్ని విధాలుగా ప్రాంతం అభివృద్ధి చెందుతుందని తెలిపారు.

త్వరలోనే చిన్నయానంలో ఉన్నతాధికారులతో సమావేశం ఏర్పాటు చేసి అన్ని వివరిస్తామని, ఏమైనా సమస్యలుంటే గ్రామస్తులు తెలియజేయాలని సూచించారు. డిప్యూటీ ఎఫ్ఆర్వో, బీట్ ఆఫీసర్ సుశీల్, గాదేపల్లి మాజీ సర్పంచ్ నక్కల భూమేశ్, మాజీ ఎంపీటీసీ చిన్నారెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

అప్రమత్తంగా ఉండాలి

● డీఎస్పీ విఠల్ రెడ్డి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ విఠల్ రెడ్డి

నస్రుల్లాబాద్(బాన్సువాడ): పోలీసులు విధుల్లో అప్రమత్తంగా ఉండాలని బాన్సువాడ డీఎస్పీ విఠల్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ డయల్ 100కు ఫిర్యాదు వచ్చిన వెంటనే పోలీసులు స్పందించాలన్నారు. సైబర్ క్రైంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట పీఎస్సై అరుణ్ కుమార్, సిబ్బంది శ్రీనివాస్, రాము, సరిత తదితరులు ఉన్నారు.

గ్యాస్ సిలిండర్ లీక్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని తాండూర్ గ్రామంలోని ఓ ఇంట్లో వంటగ్యాస్ సిలిండర్ లీకైన ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. తాండూర్‌కు చెందిన వృద్ధ దంపతులు దుర్గం రాములు, పెంటమ్మ ఇంట్లో సాయంత్రం గ్యాస్ సిలిండర్‌పై వంట చేస్తుండగా ఆకస్మికంగా గ్యాస్‌పైపు లీకై మంటలు వచ్చాయి. భయపడిన వృద్ధదంపతులు గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు ఇంట్లోకి వెళ్లి మండుతున్న గ్యాస్ సిలిండర్‌ను బయటికి తీసుకొచ్చారు. అనంతరం మంటలను ఆర్పివేయడంతో ప్రాణాపాయం తప్పింది.

అసభ్యకర పోస్టింగ్‌పై ఫిర్యాదు

నవీపేట: మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టింగ్ చేయడంపై బీజేపీ నాయకులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రధాని, కేంద్ర హోం మంత్రి, పలు రాష్ట్రాల సీఎంల చిత్రాలను మార్ఫింగ్ చేసి సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశాడు. ఫొటో వైరల్ కావడంతో నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు బూనాది ప్రవీన్, సందీప్, అజయ్, దినేశ్, రాహుల్ ఫిర్యాదు చేశారు.

ప్రైవేటు ఆస్పత్రిలో నర్సు మృతి

నిజామాబాద్ నాగారం: జిల్లా కేంద్రంలోని మనోరమ ఆస్పత్రిలో ఓ నర్సు మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా డోంగ్లికి చెందిన శిల్ప నగరంలోని మనోరమ ఆస్పత్రిలో నర్సుగా పని చేస్తోంది. శుక్రవారం రాత్రి శిల్ప విధులకు హాజరుకాగా, జ్వరంతో బాధపడుతూ రాత్రి అదే ఆస్పత్రిలో నిద్రపోయింది. తెల్లవారుజామున తోటి నర్సులు, సిబ్బంది నిద్ర లేపే ప్రయత్నం చేయగా చలనం లేకపోవడంతో వైద్యులు పరీక్షించి శిల్ప మృతి చెందినట్లు గుర్తించారు. స్థానిక ఒకటో టౌన్ పోలీసులు ఆస్పత్రికి చేరుకొని వివరాలు సేకరించారు.

తల్లి చేపా.. లేదు చిల్లి గవ్వ

- మంజూరు కాని నిధులు
- మొదలుకాని చేపల సేకరణ
- ముగుస్తోన్న సీజన్



తల్లి చేపల నిల్వ కోసం సిద్ధం చేసిన మట్టి పాండ్

బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ దిగువన ఉన్న జాతీయ చేపపిల్లల ఉత్పత్తి కేంద్రానికి అవసరమయ్యే తల్లి చేపల సేకరణ నిధుల్లేక ఆగిపోయింది. సీజన్ ముగింపునకు వస్తున్నా ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతోనే తల్లి చేపల సేకరణ ప్రక్రియ ప్రారంభంపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఈ కేంద్రానికి 5 కోట్ల చేప పిల్లలను ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉంది. జిల్లాలోని చెరువులు, ప్రాజెక్ట్‌లకు ఇక్కడి నుంచే చేపపిల్లలను సరఫరా చేయొచ్చు. కానీ, పాలకులకు టెండర్ ద్వారా దిగుమతి చేసుకునే చేపపిల్లలపై ఉన్న శ్రద్ధ ఇక్కడి ఉత్పత్తి కేంద్రంపై ఉండదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కమీషన్ల కోసమే అటు వైపు మొగ్గు చూపుతారనే ఆరోపణలున్నాయి.

మెయింటెనెన్స్‌కు నిధులు

చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంలో మెయింటెనెన్స్ కోసం ప్రభుత్వం రూ.1.5 లక్షలు మంజూరు చేసింది. దీంతో పైపులైన్, సిమెంట్ కుండీల్లో మైనర్ మరమ్మతులు చేపడుతున్నారు. మరిన్ని నిధులు మంజూరు చేస్తే నీటి కొరత లేకుండా సమస్యలను పరిష్కరించుకోవచ్చని అధికారులు చెబుతున్నారు.

రెండు టన్నులు అవసరం

చేప పిల్లల ఉత్పత్తి ప్రక్రియలో భాగంగా మొదట చెరువుల నుంచి తల్లి చేపలను దిగుమతి చేసుకుంటారు. ఈ కేంద్రానికి 2 టన్నుల తల్లి చేపలు అవసరం ఉంటుంది. దీంతో కిలోకు రూ. 100 చొప్పున మత్స్యకారుల నుంచి రెండు టన్నుల తల్లి చేపలను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అందుకు రూ. 2 లక్షలు, రవాణా ఖర్చులు రూ.50 వేలు, తల్లి చేపల పోషణ(దాణా)కు రూ. 2 లక్షలు అవసరం ఉంటుంది. మే రెండో వారం నుంచే తల్లి చేపల సేకరణ ప్రక్రియ ప్రారంభించాల్సి ఉంది. అయితే ప్రభుత్వం ఇప్పటి వరకు చిల్లి గవ్వ కూడా ఇవ్వలేదు. దీంతో తల్లి చేపల కొనుగోలుపై మత్స్యశాఖ అధికారులు సందిగ్ధంలో పడ్డారు. గతేడాది సైతం నిధుల కేటాయింపులో నిర్లక్ష్యంతో చేప పిల్లల ఉత్పత్తి ప్రక్రియ ఆలస్యంగా ప్రారంభమైంది. దీంతో పాతిక శాతం కూడా చేప పిల్లలను ఉత్పత్తి చేయలేదు.

ఉన్నతాధికారులకు నివేదించా..

తల్లి చేపల సేకరణ కోసం ఉన్నతాధికారులకు నివేదించాను. నిధులు మంజూరు చేయాలని కోరాం. వారం రోజుల్లో తల్లి చేపల సేకరణ చేపట్టాలి.

– దామోదర్, ఎఫ్‌డీవో, పోచంపాడ్

ప్రారంభమైన పచ్చళ్ల సీజన్

- మామిడికాయలు, ఇతర దినుసుల కొనుగోళ్లలో ప్రజలు బిజీ
- ఏడాదికి సరిపడా తయారీకి ఏర్పాట్లు



బాన్సువాడ సంతలో మామిడి కాయలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

బాన్సువాడ : వేసవి కాలంలో ఏ గ్రామంలో చూసిన మామిడి కాయల సుగంధం, పచ్చడి తయారీ, వడియాల సన్నాహాలతో సందడి నెలకొంటుంది. ఆహార పదార్థాలు మాత్రమే కాదు సంప్రదాయం, కుటుంబ బంధాలు, గ్రామీణ సంస్కృతి సజీవ చిహ్నాలు. పచ్చళ్లు ఆహార సంస్కృతిలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. రుచిని పెంచడమే కాక ఆహారాన్ని సంరక్షించే సంప్రదాయ పద్ధతిగా కూడా పని చేస్తాయి. గ్రామీణ ప్రాంతాలు, గిరిజన గ్రామాల్లో ఆవకాయ పచ్చడి లేని ఇల్లు ఉండదంటే ఆశ్చర్యం కలగక మానదు.

బెల్లం ఆవకాయ, మెంతి ఆవకాయ, పులిహోర ఆవకాయ వంటి రకాలు ప్రాంతాలను బట్టి మారుతూ ఉంటాయి. ఈ ప్రక్రియలో కుటుంబ సభ్యులందరూ పాల్గొనడం, పాత తరం నుంచి కొత్త తరానికి జ్ఞానాన్ని అందించడం వంటివి సాంస్కృతిక సంబంధాలను బలపరుస్తాయి.

పచ్చడి తయారీ విధానం..

- గట్టిగా, పుల్లగా ఉన్న పచ్చి మామిడి కాయలను ఎంచుకుని లోపల టెంకలు తీసి ముక్కలుగా కోయాలి.
- ఆవపిండి, ఎండుమిరపకాయల కారం, ఉప్పు, మెంతిపొడి, నువ్వుల నూనె వంటి ప్రధాన పదార్థాలు కలిపేందుకు సిద్ధం చేసుకోవాలి. కొన్ని రకాల్లో బెల్లం, వెల్లుల్లి కూడా కలుపుతారు.
- ఆ తరువాత జాడీలో కారం మిశ్రమాన్ని మామిడి ముక్కలతో పొరలు, పొరలుగా అమర్చి, పైన నూనె పోస్తారు. ఇది పచ్చడిని పాడవకుండా సంరక్షిస్తుంది.
- 34 రోజులపాటు గాలిచొరబడకుండా మూత పెట్టి ఉంచిన తర్వాత తినడానికి తయారవుతుంది. కొన్ని రకాలు ఎండబెట్టి దీర్ఘకాల నిల్వకు సిద్ధం చేస్తారు.

ఆరోగ్య ప్రయోజనాలెన్నో..

మామిడి పచ్చడిలు రుచికరమైనవే కాకుండా ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉన్నాయి. వీటిని మితంగా తీసుకోవడం ముఖ్యం. పచ్చి మామిడిలో పొటాషియం, ఇతర ఖనిజాల వల్ల వేసవిలో డీహైడ్రేషన్, జీర్ణక్రియను మెరుగుపర్చుకోవడం, మలబద్ధకం వంటి సమస్యలను నివారిస్తాయి. విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు శరీరాన్ని వ్యాధుల నుంచి కాపాడతాయి. జీలకర్ర జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయ పడుతుంది.

బంధాలను బలపరుస్తుంది



ప్రతి సంవత్సరం వేసవిలో మామిడి పచ్చడి చేయడం ఒక పండుగలా ఉంటుంది. కుటుంబ సభ్యులందరం కలిసి తయారీలో పాల్గొంటాం.ఏడాది పొడవునా రుచిని ఇస్తుంది. అలాగే మా కుటుంబ బంధాలను కూడా బలపరుస్తుంది.

–పుష్పలత, శెట్లూరు గ్రామం

కాలువ లైనింగ్‌కు మరమ్మతులు చేపట్టరూ!



కాకతీయ కాలువ జీరో పాయింట్ వద్ద ధ్వంసమైన లైనింగ్



వెల్కటూర్ శివారులో ధ్వంసమైన కాకతీయ కాలువ లైనింగ్

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ప్రాజెక్ట్ నుంచి ఆయకట్టుకు నీరు సరఫరా చేసే కాకతీయ కాలువ లైనింగ్ ధ్వంసమై, అధ్వానంగా మారింది. కాలువ నీటి సామర్థ్యం 9 వేల క్యూసెక్కులు కాగా ప్రస్తుతం 6వేల క్యూసెక్కుల కంటే ఎక్కువ నీటిని వదిలే పరిస్థితి లేకుండాపోయింది. అలాగే చివరి ఆయకట్టు వరకు నీరు అందడం లేదు. ధ్వంసమైన లైనింగ్‌కు యాసంగి సీజన్ ప్రారంభంలో మరమ్మతులు చేపడుతామని అధికారులు పేర్కొన్నారు. కానీ ఇప్పటి వరకు చేపట్టలేదు. మరమ్మతుల కోసం గత ప్రభుత్వ హయాం నుంచి అధికారులు ఏటా ప్రతిపాదనలు పంపిస్తున్నారు. కానీ నిధులు మంజూరు కావడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కనీసం లైనింగ్ ధ్వంసమైన ప్రదేశంలోనైనా మరమ్మతులు చేపట్టాలని, కాలువలో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని రైతులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

కాకతీయ కాలువ లైనింగ్ మరమ్మతుల కోసం రూ.2.5కోట్ల అంచనాతో ప్రభుత్వానికి తాజాగా ప్రతిపాదనలు పంపించాం. మంజూరు కాగానే టెండర్ ప్రక్రియ ప్రారంభిస్తాం. ఈ ఏడాది చేసే పరిస్థితి లేదు.

– రఘుపతి, డిప్యూటీఈఈ, కాకతీయ కాలువ

'లూపస్'పై అవగాహన అవసరం



రన్ అనంతరం ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

నగరంలో 2కే రన్

నిజామాబాద్ నాగారం: శరీరంలోని అన్ని భాగాలను ప్రభావితం చేసే 'లూపస్' వ్యాధిపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని వైద్యులు సూచించారు. ప్రపంచ లూపస్ దినోత్సవం సందర్భంగా శనివారం ఐఎంఏ, నిజామాబాద్ రుమటాలజీ అండ్ ఆర్థరైటిస్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహించారు. వినాయక్‌నగర్‌లోని హనుమాన్ జంక్షన్ నుంచి రుమటాలజీ అండ్ ఆర్థరైటిస్ సెంటర్ వరకు రన్ కొనసాగింది. అనంతరం చర్మవ్యాధి నిపుణురాలు గ్రీష్మ మాట్లాడుతూ లూపస్ వ్యాధి కళ్లు, మెదడు, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, రక్త నాళాలు తదితర ఏ భాగాన్ని అయినా ప్రభావితం చేస్తుందన్నారు. అన్ని అవయవాలపై దాడి చేస్తుందని తెలిపారు.

ఐఎంఏ అధ్యక్షుడు డా అజ్జ శ్రీనివాస్, కోశాధికారి డా. రాజేందర్ మాట్లాడుతూ లూపస్ వ్యాధి నివారణకు రుమటాలజిస్టును సంప్రదించి సూచించిన మందులు వాడాలన్నారు. డాక్టర్ జీ రవి కిరణ్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లు, మంచి నిద్ర, క్రమం తప్పకుండా వ్యాయామం తదితర మంచి జీవనశైలిని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు జీవన్ రావు , శ్రీశైలం, పీటీ కృష్ణమూర్తి, దామోదర్ రావు, ద్వారకానాథ్, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కీర్తిని ప్రపంచానికి చాటిన సౌమ్య



ఫుట్‌బాల్ అంతర్జాతీయ క్రీడాకారిణి సౌమ్యను సన్మానిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

నిజామాబాద్‌నాగారం: జిల్లాకు చెందిన క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ప్రతిభ చాటుతూ జిల్లా కీర్తిని ప్రపంచ వ్యాప్తంగా చాటుతున్నారని, ఫుట్‌బాల్ క్రీడాకారిణి గుగులోత్ సౌమ్య మరింత చాటిందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ కొనియాడారు. జిల్లా కేంద్రంలోని గీతా భవనంలో శనివారం నిజామాబాద్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయస్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్ జట్టులో స్థానం పదిలం చేసుకున్న గుగులోత్ సౌమ్యకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ హాజరై ఆమెను అభినందిస్తూ సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడాకారులకు ప్రోత్సాహాన్ని అందించేందుకు తాను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుతో కలిసి కృషి చేస్తానని తెలిపారు.

అనంతరం ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య, ఉపాధ్యక్షుడు భక్తవత్సలం మాట్లాడుతూ.. ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా జిల్లాకు ప్రత్యేక క్రీడామైదానంతో పాటు కోచ్‌లు, వసతులు లేక క్రీడాకారులు ఇక్కట్లకు గురవుతున్నారన్నారు. కోచ్ నాగరాజు, నిఖత్ జరీనా, భూమ్‌రెడ్డి సంజీవరెడ్డి, అబ్బన్న, రమేశ్ , ఉమర్, సురేశ్, జావీద్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

నల్లమట్టి లారీ బోల్తా



బోల్తాపడిన నల్లమట్టి లారీ

నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండలంలోని విజయనగరం గ్రామం వద్ద నల్లమట్టిని తరలిస్తున్న లారీ బోల్తా పడింది. నిర్మల్ జిల్లా పంచగూడ గ్రామ సమీపంలోని గోదావరి పరీవాహక ప్రాంతం నుంచి ఆర్మూర్ పరిసర ప్రాంతాలకు నల్లమట్టిని తరలిస్తుండగా భారీ లారీ విజయనగరం గ్రామ సమీపంలోని కల్వర్టు వద్ద బోల్తా పడింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని రోడ్డుపై నుంచి లారీతోపాటు నల్లమట్టిని తొలగించడంతో రాకపోకలు యథావిధిగా కొనసాగాయి.

ఈత చెట్లు దగ్ధం



కాలిపోయిన ఈత చెట్లు

రుద్రూర్: మండలంలోని రాణంపల్లి శివారులో శనివారం మధ్యాహ్నం ఈత చెట్లు దగ్ధమయ్యాయి. సమీప పొలంలో నుంచి వచ్చిన మంటలతో 40 ఈత చెట్లు కాలిపోయినట్టు బాధితులు తెలిపారు. బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని బాధితులు అధికారులను కోరారు.

క్రైం కార్నర్

భార్యను కడతేర్చిన భర్త



లావణ్య తల్లిదండ్రుల నుంచి వివరాలను సేకరిస్తున్న ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్

ఆర్మూర్‌టౌన్: కట్టుకున్న భర్తే ఆమె పాలిట యముడయ్యాడు. అనుమానంతో భార్యను బెడ్‌షీట్‌తో ఊపిరి ఆడకుండా చేసి దారుణంగా హత్య చేసిన ఘటన ఆర్మూర్ మున్సిపల్ పరిధి పెర్కిట్‌లోని తిరుమల కాలనీలో శనివారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. జక్రాన్‌పల్లి మండల కేంద్రానికి చెందిన లావణ్య(28)కు తొమ్మిదేళ్ల క్రితం ఆకుల ప్రవీణ్‌తో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు అక్షయ, అద్వైత, ఒక కుమారుడు నిహాల్ ఉన్నాడు. కుటుంబ ఆర్థిక ఇబ్బందులతోపాటు భార్యపై అనుమానంతో తరచూ గొడవలు జరుగుతుండేవి. శుక్రవారం రాత్రి ప్రవీణ్‌తో లావణ్య గొడవకు దిగింది. గొడవ ముదరడంతో కోపోద్రిక్తుడైన ప్రవీణ్ బెడ్‌షీట్‌తో లావణ్యకు ఊపిరి ఆడకుండా చేసి హత్య చేశాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ప్రవీణ్‌ను అదుపులో తీసుకున్నారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ తెలిపారు.

బైక్, లారీ ఢీ.. ఒకరి మృతి

సదాశివనగర్: సదాశివనగర్ మండలంలోని మోడేగావ్ శివారులో బైక్, లారీ ఢీకొన్న ఘటనలో బైకుపై ప్రయాణిస్తున్న ఒకరు మృతి చెందినట్లు ఎస్సై రంజిత్ శనివారం తెలిపారు. చిన్నమల్లారెడ్డి గ్రామానికి చెందిన నర్సాగౌడ్(55) మొండి సడక్ నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా మోడేగావ్ శివారులో లారీ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ఘటనా స్థలంలోనే నర్సాగౌడ్ మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చేపలవేటకు వెళ్లి వృద్ధుడి దుర్మరణం

రుద్రూర్: పొతంగల్ మండల శివారులోని మంజీరా నదిలో చేపలవేటకు వెళ్లిన తోకల గంగారాం (65) అనే వృద్ధుడు ప్రమాదవశాత్తు నీటిలో జారిపడి మృతి చెందినట్లు కోటగిరి ఎస్సై సునీల్ తెలిపారు. శనివారం ఉదయం చేపలు పడుతుండగా గంగారాం ప్రమాదవశాత్తు తెప్పపై నుంచి నీటిలో జారి పడిపోయాడు. చేపలు పట్టే వల కాళ్లకు చుట్టుకోవడంతో నీటమునిగి ఊపిరి ఆడక మృతి చెందాడు. మృతుడి భార్య తోకల లచ్చవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధురాలు..

మాక్లూర్: మండలంలోని అమ్రాద్ శివారులో ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన శనివారం సుమారు 60 ఏళ్ల వృద్ధురాలి శవాన్ని గుర్తించినట్టు మాక్లూర్ ఎస్సై రాజశేఖర్ తెలిపారు. వృద్ధురాలి గురించి తెలిసిన వారు ఎవరైనా ఉంటే మాక్లూర్ పోలీసులను సంప్రదించాలని పేర్కొన్నారు. మృతదేహాన్ని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

రెంజల్(బోధన్): మండలంలోని దూపల్లి గ్రామానికి చెందిన ఓ వృద్ధుడు అనారోగ్యంతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. గ్రామానికి చెందిన గోపాల్ గంగారాం(60) శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి స్థానిక చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం స్థానికులు గుర్తించి సమాచారం అందించడంతో పంచనామా నిర్వహించి మృతదేహాన్ని బోధన్‌లోని జిల్లా ఆస్పత్రికి తరలించామన్నారు. కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జాన్కంపేట లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో చోరీ



హుండీని పరిశీలిస్తున్న ఎస్సై వంశీకృష్ణారెడ్డి

ఎడపల్లి (బోధన్): మండలంలోని జాన్కంపేట్ గ్రామ శివారులో గల లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో చోరీ జరిగినట్లు ఆలయ పూజారి రఘు శనివారం తెలిపారు. దుండగులు ఆలయంలోని హుండీని వెల్డింగ్ కట్టర్లతో ధ్వంసం చేసి భక్తులు సమర్పించుకున్న నగదు, వెండి, బంగారం నగలను ఎత్తుకెళ్లారన్నారు. సమాచారం అందుకున్న ఎస్సై వంశీకృష్ణారెడ్డి ఆలయాన్ని సందర్శించి హుండీని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వాహనాలు సీజ్



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై రాఘవేంద్ర

లింగంపేట(ఎల్లారెడ్డి): చలాన్లు చెల్లించకుండా తిరుగుతున్న రెండు వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్సై రాఘవేంద్ర తెలిపారు. లింగంపేట మండలం ముస్తాపూర్ గ్రామం వద్ద ఆయన శనివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. సీజ్ చేసిన వాహనాలపై రూ. 3450 చలాన్ పెండింగ్‌లో ఉన్నట్లు పేర్కొన్నారు. మరో 23 వాహనాలను తనిఖీ చేసి హెల్మెంట్, డ్రైవింగ్ లైసెన్సు లేని వాహనదారులకు జరిమానా విధించామన్నారు. ఆయన వెంట సిబ్బంది రాజు, జువ్వినాయక్, మదన్ లాల్, వసంత్ ఉన్నారు.

కలెక్టర్ చెప్పినా కరుణించరా?



పెద్దవాగు రోడ్డుపై ఉన్న ధాన్యం బస్తాలు



ధాన్యం కుప్పపై వేసిన ముళ్ల కంప

- పెద్దవాగు రోడ్డుపై ధాన్యం బస్తాలు
- రెండు రోజుల్లో తరలించాలని అధికారులను ఆదేశించిన కలెక్టర్
- ఇప్పటికీ కదలని ధాన్యం బస్తాలు

బాల్కొండ: రహదారిపై కిలోమీటర్ల మేర ఉన్న ధాన్యం బస్తాలను రెండ్రోజుల్లో తరలించాలని సాక్షాత్తు జిల్లా పాలనాధికారి ఆదేశించినా అధికారుల్లో చలనం లేదు. ముప్కాల్ మండలం వెంచిర్యాల్ గ్రామశివారులో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రెండు రోజుల క్రితం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు పరిశీలించారు. జాతీయ రహదారి 44 నల్లూర్ చౌరస్తా నుంచి పెద్ద వాగు వరకు సుమారు 10 కిలో మీటర్ల మేర రోడ్డుపై ధాన్యం బస్తాలు, వడ్ల కుప్పలను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కారణాలు చెప్పకుండా రెండ్రోజుల్లో బస్తాలను తరలించాలని అధికారులను ఆదేశించారు. కానీ, పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంలా ఉంది. తూకం వేసి నెల రోజులు దాటుతున్నా ధాన్యం బస్తాలు తరలించక పోవడంతో రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. స్వయంగా కలెక్టరే పరిస్థితిని గమనించి అధికారులను ఆదేశించినా ప్రయోజనం లేకపోవడంతో నిట్టూరుస్తున్నారు. మరోవైపు నెలల తరబడి ధాన్యం తూకం వేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నిత్యం గాలివాన కురుస్తుండడంతో ధాన్యం కుప్పలపై ముళ్లకంపలు వేస్తున్నారు. అధికారులు స్పందించి కొనుగోళ్లు వేగవంతం చేసి, ధాన్యం బస్తాలను తరలించాలని వేడుకుంటున్నారు.

నెల రోజులవుతోంది..

పెద్దవాగు రోడ్డుపై ధాన్యం ఆరబెట్టి కుప్పలు చేసి నెల రోజులు గడుస్తోంది. ఇప్పటి వరకు బస్తాలు నింపి కాంటా వేయలేదు. ధాన్యం నింపిన బస్తాలను మిల్లుకు తరలించలేదు. కలెక్టర్ చెప్పినా పట్టించుకోవడం లేదు.

– గంగారెడ్డి, రైతు, నాగంపేట్